సాక్షి మెదక్

బుధవారం । 22 । జనవరి । 2025



నమో దీదీ.. ఆమెకు ఉపాధి

మహిళా సాధికారికతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నమోద డ్రోన్ దీదీ పథకం ప్రవేశపెట్టి డ్రోన్లు అందజేస్తుంది. వివరాలు 8లో ▸



ఉత్సాహంగా పోటీలు

సిద్దిపేట పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడల పోటీలు ప్రారంభం అయ్యాయి. వివరాలు 8లో



అర్హులందరికీ పథకాలు..

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా.. కోసం లబ్ధిదారులను ఎంపికకు గ్రామసభలు నిర్వహించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

హరీశ్‌ను కలిసిన సునీత



హరీశ్‌రావుతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: బీఆర్ఎస్ అగ్రనేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించామని ఎమ్మెల్యే చెప్పారు. కాగా, పార్టీ బలోపేతంతో పాటు ప్రజల సమస్యలకు అండగా ఉండాలని సూచించారన్నారు. ఎమ్మెల్యే వెంట కొల్చారం మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, నవాజ్, రమేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: వాహనాలు నడిపే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యమే కుటుంబాలను రోడ్డు పాలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ నియమాలు పాటించి రోడ్డు భద్రతలో భాగస్వాములు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారులపై అతివేగంతో వచ్చే వాహనాలను గుర్తించి భారీ జరిమానా విధిస్తున్నట్లు చెప్పారు. మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు, అతి వేగంగా అజాగ్రత్తగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహనాలు నడిపినప్పుడు అందరూ సీట్ బెల్ట్ ధరించి ఉండాలని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ దరించాలని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు అప్పజెప్పవద్దని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ఆధ్వర్యంలో తనిఖీలు ఉంటాయని తెలిపారు.

28న కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



సమావేశంలో పాల్గొన్న పీఈటీలు

పాపన్నపేట(మెదక్): ఈ నెల 28న పాపన్నపేటలో సీనియర్ మెన్, సబ్ జూనియర్ బాయ్స్ కబడ్డీ క్రీడాకారులు ఎంపిక జరుగుతుందని మెదక్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి రమేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో, అక్కడ ఎంపికైన వారు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పురుషులు 85 కిలోల బరువు ఉండాలని, జూనియర్ బాలురు, బాలికలు 55 కిలోల వరకు బరువు ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వయిజర్ గోపాల్, కోశాధికారి పి.రవి, జె.ప్రశాంత్, కుమార్, రాజాగౌడ్, శ్రీకాంత్, శశికుమార్, సాయిలు ఉన్నారు.

30 థియరీ, 33 ప్రాక్టికల్ సెంటర్లు

ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ విద్యార్థులు ప్రశాంతంగా పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారని ఇంటర్ విద్యాశాఖ అధికారిణి మాధవి తెలిపారు. మంగళవారం ఇంటర్ బోర్డు అధికారులు నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ఇంటర్ విద్యార్థులకు థియరీ 30, 33 ప్రాక్టికల్ సెంటర్ల ఉన్నట్లు తెలిపారు. ఎక్కడైన సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని బోర్డు అధికారులు సూచించినట్లు తెలిపారు. దీని ద్వారా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వేతన సమస్యలు, ఇతర సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డీపీఓ యాదయ్య

పాపన్నపేట(మెదక్): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయని డీపీఓ యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. గతంలో దరఖాస్తు చేయని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకొని పథకాలు పొందవచ్చన్నారు. 12 గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఎంపీడీఓ విష్ణువర్ధన్, ఎంపీఓ పరమేశ్వర్, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభలు

- జాబితా తప్పులతడకగా ఉందని స్థానికుల ఆగ్రహం
- అనర్హులకు ప్రాధాన్యం ఇచ్చారంటూ వాగ్వాదం, నిలదీత

గ్రామసభలు రసాభాసగా మారాయి. జాబితాలు తప్పులతడకగా ఉన్నాయని ప్రజలు నిలదీశారు. రాజకీయ నేతలు సూచించిన వారికే ప్రాధాన్యం ఇచ్చి అర్హులను గాలికొదిలేశారని ఆరోపించారు. దీంతో సభల్లో అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఇది నిరంతర ప్రక్రియ అని మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చని సర్దిచెప్పినా విన్పించుకోని పరిస్థితి కనిపించింది.



చిన్నశంకరంపేట మండలం టి.మందాపూర్‌లో గ్రామస్తులను సముదాయిస్తున్న పోలీసులు

మెదక్‌జోన్: మెదక్ జిల్లాలోని చిన్నశంకరంపేట మండలంలోని టి మాందాపూర్, రుద్రారం గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో అధికారులను ప్రజలు నిలదీశారు. అనర్హుల పేర్లు ఉన్నాయన్నారు. చేగుంట మండలం ఉల్లి తిమ్మాయిపల్లి జత్రం తండాల్లో సొంత స్థలాలు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. వెల్దుర్తి మండలం శెట్టిపల్లి గ్రామ సభలో ఆత్మీయ రైతు భరోసా పథకంలో అనర్హుల పేర్లు ఉన్నాయని సభను అడ్డుకున్నారు. కొల్చారం మండలం కోనాపూర్ గ్రామ సభలోనూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు పనిదినాలతో ముడిపెట్టవద్దని ఆందోళనకు దిగారు. నిజాంపేట మండలం నందగోపాల్‌లో అర్హుల పేర్లు లేవని మండిపడ్డారు. కౌడిపల్లి, మనోహరాబాద్ మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాగా అర్హత కలిగిన వారి నుంచి మళ్లీ దరఖాస్తులు ఇస్తే తీసుకుంటామని అధికారులు జవాబు ఇచ్చారు. అయినా ప్రజలు ఆందోళనలు, నిరసనలను వ్యక్తం చేశారు. వరుసగా సర్వేలు చేసిన అధికారులు రాజకీయ నాయకులు ఇచ్చిన పేర్లకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. మొదటిరోజే గందరగోళం నెలకొంది. ఇంకా మూడు రోజుల పాటు సభలు జరగాల్సి ఉంది.

ఐదు రోజులపాటు సర్వే..

మెదక్ జిల్లాలో ఈనెల 15 నుంచి 20 వరకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ అధికారులు, పంచాయతీ సెక్రటరీలతో కలిసి వేలాది మంది సిబ్బంది.. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, భూములు లేని నిరుపేదలకు యేటా రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఆర్థిక భరోసా, రేషన్‌కార్డులు అందించేందుకు అర్హులను గుర్తించారు. ఆ జాబితాలను మంగళవారం గ్రామ సభల్లో అధికారులు చదివి వినిపించారు.

ఆర్టీసీకి సంక్రాంతి ధమాకా

10 రోజుల్లో రూ.13.73 కోట్ల ఆదాయం

- రద్దీకి అనుగుణంగా సర్వీసుల నిర్వహణ
- అన్ని బస్సులూ కిటకిట
- సమష్టి కృషి ఫలితమే: ఆర్ఎం



నారాయణఖేడ్: సంక్రాంతి పండుగ సీజన్‌ను ఆర్టీసీ ఫుల్‌గా క్యాష్ చేసుకుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎనిమిది ఆర్టీసీ డిపోల నుంచి పది రోజులు సాధారణ సర్వీసులతోపాటు ప్రత్యేక సర్వీసులు నడిపి రూ.13.73 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఈనెల 9 నుంచి 13 వరకు, సంక్రాంతి పండుగ తర్వాత 16 నుంచి 20వ తేదీవరకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నా.. వెనుకడుగు వేయకుండా సర్వీసులను నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి 374 సర్వీసులను నడిపింది. ఇందులో పండుగకు ముందు 201 సర్వీసులు నడపగా, పండుగ ముగిశాక తిరుగు ప్రయాణంగా ఉండే ప్రయాణికుల కోసం 173 సర్వీసులను నడిపింది. ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సర్వీసులను అందుబాటులో ఉంచారు.

కార్మికుల సహకారం..



ఆర్టీసీ సంస్థ ప్రత్యేక సర్వీసులు నడిపిన ప్రతీసారి కార్మికులు, ఆర్టీసీ ఉద్యోగులందరూ సహకరిస్తున్నారు. సమష్టి కృషి ఫలితంగానే ప్రత్యేక సర్వీసులు నడపటం సాధ్యపడుతుంది. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తూ సంస్థకు సహకరించాలి.

– ప్రభులత, రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) సంగారెడ్డి

దసరాకు 14.72కోట్లు.. సంక్రాంతికి 13.73కోట్లు

ఆర్టీసీ రెండు నెలల్లో వచ్చిన ప్రధాన పండుగలతో మంచి ఆదాయాన్ని సమకూర్చుకుంది. సంక్రాంతికి 10రోజులపాటు సర్వీసులు నడిపి రూ.13.73 కోట్ల ఆదాయం రాబట్టగా దసరాకు 12 రోజులపాటు ప్రత్యేక సర్వీసులు తిప్పి రూ.14.72కోట్ల ఆదాయం సమకూర్చుకుంది.

రీజియన్ పరిధిలో డిపో వారీ తిరిగిన బస్సులతో సమకూరిన ఆదాయం వివరాలు

డిపో	కి.మీ(లక్షల్లో)	ఎర్నింగ్ (వచ్చిన ఆదాయం కోట్లలో)	ఈపీకే (కి.మీ.కు వచ్చిన ఆదాయం)	ఓఆర్ (100కు నిండిన సీట్లు)
మెదక్	3.17	2.30	72.48 (రూ.)	123.67
నారాయణఖేడ్	2.11	1.28	60.95	96.67
సంగారెడ్డి	3.16	1.97	62.49	108.88
జహీరాబాద్	3.42	2.11	64.93	105.91
సిద్దిపేట	4.01	2.65	66.10	110.29
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	2.79	2.3	72.95	128.81
దుబ్బాక	1.34	85.12	63.45	108.21
నర్సాపూర్	0.64	41.56(లక్షలు)	65.42	119.62

కండక్టర్లు, డ్రైవర్లకు ప్రోత్సాహకాలు

సంక్రాంతి పండుగ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించారు. సాధారణ సర్వీసుల తరహాలోనే మహిళలు సైతం ఈ సర్వీసుల్లోనూ ఉచితంగా ప్రయాణించారు. కాగా, మెజార్టీ డిపోల్లో కార్మికుల సంఖ్య తక్కువ ఉంది. కానీ ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సర్వీసులు రద్దు కాకుండా కార్మికులు డబుల్ డ్యూటీలు నిర్వహించారు. ఇలా చేసిన డ్రైవర్లకు రూ.1,000, కండక్టర్లకు రూ.650 చొప్పున వెంటనే చెల్లించింది. సర్వీసులకు సరాసరి ఆదాయం కంటే ఎక్కువ తెచ్చిన సర్వీసుల డ్రైవర్లు, కండక్టర్లకు సైతం ప్రోత్సాహకాలను అందజేశారు. పండుగ సమీపించిన రెండు రోజులు, తిరుగు ప్రయాణం సందర్భంగా మరో రెండు రోజులు రద్దీ విపరీతంగా ఉండటంతో కార్మికుల భోజనం వెళ్లే సమయం లేకపోవడంతో ఆర్టీసీ అధికారులే భోజనాలు వండించి పార్శిళ్లను అందజేశారు.

స్పెషల్ బస్సులతో నిలువు దోపిడీ

సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: ఉచిత బస్సు పేరుతో ఇతర పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్‌భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉచిత బస్సు పథకం పేరుతో అన్ని రూట్లలో బస్సులు తగ్గించారన్నారు. ఆయా రూట్లలో సరిపడా బస్సులు లేక ఉన్న వాటిల్లోనే ప్రయాణించలేక ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారని మండిపడ్డారు. పండుగల సమయంలో అడ్డగోలుగా టికెట్ ధరలు పెంచి ప్రయాణికులను ఆర్టీసీకి దూరం చేస్తున్నారని విమర్శించారు. గతంలో మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తే గౌరవంగా లేచి సీటు ఇచ్చేవారు. ప్రస్తుతం నెలలు నిండిన గర్భిణి అయినా ఎవరూ స్పందించడం లేదన్నారు. ఉచిత బస్సు పథకం వచ్చాక మహిళలకు గౌరవం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రూట్లలో అవసరమైన బస్సులు నడిపించాలని డిమాండ్ చేశారు.

ప్రొటోకాల్ రగడ

- అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు
- బ్యానర్‌పై ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలు పెట్టాలని డిమాండ్
- నర్సాపూర్ మండలం తుల్జారంపేటలో ఉద్రిక్తత



తుల్జారాంపేట గ్రామ సభలో నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం తుల్జారంపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభలో ప్రొటోకాల్ రగడ చోటు చేసుకుంది. మొదటి రోజు గ్రామ సభకు అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మధులత హాజరై ప్రారంభించబోయారు. ఈ క్రమంలో గ్రామసభ వద్ద ఉన్న బీఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ బాబ్యా నాయక్, తుల్జారాంపేట మాజీ సర్పంచ్ సామ్యా నాయక్, బీజేపీ నాయకుడు రాములు నాయక్, మరి కొంతమంది కలిసి గ్రామ సభ బ్యానర్‌పై ఎమ్మెల్యే సునీతా రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ ఫొటోలు పెట్టాలని పట్టుబట్టారు. లేకుంటే ప్రజాపాలనలో పెట్టిన బ్యానర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డాడు. ఈ క్రమంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వెంటనే అదనపు కలెక్టర్‌తోపాటు అధికారులు, ఎస్సై లింగం, పోలీస్ సిబ్బంది సముదాయించారు. గ్రామసభను కొనసాగే విధంగా సహకరించాలని కోరారు. అనంతరం గ్రామసభ యథావిధిగా కొనసాగింది. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలను పెట్టాలని నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

10 గ్రామాల్లో గ్రామ సభలు

మండలంలోని తుల్జారాంపేటతోపాటు అవంచ, ఆద్మాపూర్, చెప్పల్ తూర్తి, గూడెం గడ్డ, జక్కపల్లి, కాజీపేట, మాడాపూర్, మహ్మదాబాద్, నాగులపల్లి, గ్రామాల్లో మొదటి రోజు గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు పథకాల బ్ధి పొందే వారి వివరాలతోపాటు రైతు భరోసా కోసం సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలను వెల్లడించారు.

ఆందోళన వద్దు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: కలెక్టర్
- గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక



ఔరంగాబాద్ తండాలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళీఘణాపూర్(మెదక్): ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నామని, గ్రామ సభలు నిర్వహించిన తర్వాతనే అర్హులుగా గుర్తిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన హవేళీఘణాపూర్ మండలం ఔరంగాబాద్ తండా, మెదక్ మండలం శివ్వాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు తయారు చేసిన జాబితాలో తమ పేర్లు లేదనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాపాలనలో తిరిగి దరఖాస్తు చేసుకుంటే అధికారులు తిరిగి విచారణ చేస్తారన్నారు. అర్హులైన లబ్దిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజల మధ్యలో ఎంపిక జరగాలని, నిష్పక్షపాతంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సభలలో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. ఏటా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రానున్న నాలుగేళ్ల కాలంలో ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు రమేశ్, నవీన్, సెక్రటరీ మౌనిక ఉన్నారు.

అర్హులుంటే దరఖాస్తు చేసుకోండి

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో కలెక్టర్ పాల్గొన్నారు. లబ్దిదారుల ఎంపికకు ఈనెల 24 వరకు మున్సిపల్ వార్డులలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లిస్టులో తమ పేర్లు రానివారు, ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని అర్హులైన వారుంటే వారి నుంచి దరఖాస్తు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నేడు మెదక్‌లో బైక్ ర్యాలీ

మెదక్ కలెక్టరేట్: అందరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఉదయం 10 గంటలకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి రాందాస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. రోడ్డు భద్రత కార్యక్రమాలపై రూపొందించిన రహదారి సురక్ష అభియాన్ శ్రద్ధ 2025 వాల్‌పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

ఎలక్ట్రికల్ రైలుతో కాలుష్యానికి చెక్

- చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బ్రిజ్‌మోహన్
- ట్రయిల్ రన్ నిర్వహించిన అధికారులు



రామాయంపేట: అక్కన్నపేటలో విద్యుత్ రైలు ప్రారంభించిన అధికారులు

రామాయంపేట(మెదక్)/మెదక్‌జోన్: ఎలక్ట్రికల్ రైళ్లతో కాలుష్యానికి చెక్ పెట్టడంతో పాటు దూరప్రాంతాలకు సైతం రైళ్ల రాకపోకలను పెంచేందుకు వీలు పడుతుందని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బ్రిజ్‌మోహన్ అన్నారు. మెదక్-అక్కన్నపేట వరకు రూ.15.49 కోట్లతో నిర్మించిన 17.2 కిలోమీటర్ల మేర విద్యుద్దీకరణ రైల్వే ట్రయిల్ రన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ డివిజన్ పరిధిలో 94 శాతం విద్యుద్దీకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. రానున్న రోజుల్లో మెదక్ నుంచి తిరుపతి, ముంబై వంటి దూర ప్రాంతాలకు రైళ్లు నడుపుతామని చెప్పారు. అలాగే మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు కొత్తగా నిర్మించిన రైల్వేమార్గానికి విద్యుద్దీకరణ పనులు చేపడతారని తెలిపారు. మేడ్చల్ నుంచి మెదక్ జిల్లా మీదుగా మహారాష్ట్రలోని మోర్తాడ్ వరకు 251 కిలోమీటర్లు డబ్లింగ్ కూడా మంజూరైందని, డబ్లింగ్ పూర్తయితే అదనపు రైలు నడపడంతో పాటు రైళ్ల వెయిటింగ్ సమస్య తీరిపోతుందని చెప్పారు. అంతకుముందు రైల్వే డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్, పీసీఈఈ బిరజ్ మోహన్‌మీనా తదితరులు అక్కన్నపేట స్టేషన్‌లో పూజా కార్యక్రమం నిర్వహించారు.

కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న విద్యాశాఖ

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసే అవకాశం
- జిల్లాలో 16 ప్రభుత్వ కళాశాలలు, 5,220 విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): ఎట్టకేలకు జూనియర్ కళాశాల విద్యార్థుల ఏడేళ్ల కల సాకారం కానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు ఇంటర్ విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దీంతో పల్లెల నుంచి కాలి నడకన కళాశాలకు వచ్చే విద్యార్థుల ఆకలి బాధలు తీరనున్నాయి. జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 5,220 విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు.

ఇప్పటివరకు పాఠశాలలకే...

2001లో అప్పటి ప్రభుత్వం మండలానికో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. దీంతో కళాశాలలకు అమ్మాయిల సంఖ్య పెరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాల విద్యార్థులు బస్సు సౌకర్యాలు లేకపోయినప్పటికీ కాలి నడకన కాలేజీకి రావడం ప్రారంభించారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఇంటర్ బోర్డు, ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. దీంతో కాలి నడకన వచ్చే విద్యార్థులు ఉదయం 8 గంటలకే ఇళ్ల నుంచి బయల్దేరుతున్నారు. చద్దన్నమో, రాత్రి చేసిన రొట్టె ముక్కో తినేసి అర్ధాకలితో కాలేజీలకు వస్తున్నారు. దీంతో విద్యార్థులు అర్ధాకలితోనే పాఠాలు వింటున్నారు.



మధ్యాహ్న భోజనం తీసుకుంటున్న విద్యార్థులు

2018లో అనుకున్నా..

సర్కార్ కళాశాలల్లో చదివే జూనియర్, డిగ్రీ, బీఈడీ, డీఈడీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం పెట్టాలని అప్పటి ప్రభుత్వం 2018లో భావించింది. అయితే ఈ నిర్ణయం అమలుకు నోచుకోలేదు. 2020-21లో కూడా ఆచరణ సాధ్యం కాలేదు. వచ్చే విద్యా ఏడాది నుంచి కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అందించాలని భావించడంతో ప్రతిపాదనలు సమర్పించేందుకు ఇంటర్ విద్యాశాఖ సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.20 నుంచి 25 వరకు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

పాఠాలు చెవికెక్కుతాయా..!



మాది ముద్దాపురం. పాపన్నపేట జూనియర్ కళాశాలలో బైపీసీ చదువుతున్నా. 5 కి.మీ దూరంలో గల మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. ఉదయం చద్దన్నమో, రొట్టె ముక్కలో ఉంటే తిని వాగులు, వంకలు దాటుకుంటూ కాలేజీకి వస్తాం. మధ్యాహ్నం ఒంటి గంటనుంచి ఆకలి మొదలవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పాఠాలు చెవికెక్కుతాయా?

– యాదిలక్ష్మి, ఇంటర్ ఫస్టియర్,పాపన్నపేట

ఇంకా ఆదేశాలు రాలేదు

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడతారనే వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు మాకు ఆదేశాలు రాలేదు. ఇంటర్ విద్యార్థులకు భోజనం పెడితే ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. పల్లెటూళ్ల నుంచి వచ్చే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది.

– మాధవి, డీఐఈవో, మెదక్

క్లుప్తంగా

యువతి అదృశ్యం


ప్రవళిక (ఫైల్)

చేగుంట(తూప్రాన్): యువతి అదృశ్యమైన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మాసాయిపేటకు చెందిన శివ్వంపేట రవి పెద్ద కూతురు ప్రవళిక రోజూ కూలీ పనులకు వెళ్లేది. సోమవారం పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం తూప్రాన్‌కు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. చిన్నకూతురు శ్వేత ఫోన్ చేయగా నేను ఇంట్లోంచి వెళ్లిపోతున్నాను తిరిగిరానని స్విచ్ఛాఫ్ చేసింది. ప్రవళిక ఆచూకీ కోసం బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడో తరగతి విద్యార్థి ఆకస్మిక మృతి


నితిన్ (ఫైల్)

నారాయణఖేడ్: ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ ఘటన ఖేడ్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన జయమ్మ కుమారుడు కొండవీటి నితిన్(12) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లడానికి తయారై బ్రెడ్ తిని టీ తాగాడు. కొద్దిసేపయ్యాక శ్వాస ఆడటం లేదని ఇబ్బంది పడుతుండగా వెంటనే స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎలాంటి జబ్బు లేకున్నా నితిన్ అకస్మాత్తుగా మృతిచెందడం కాలనీవాసులను కంటతడిపెట్టించింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలు

పటాన్‌చెరు టౌన్ : చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన సరస్వతి(72) గ్రామ పరిధిలో జనతా గ్యారేజ్ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా 11న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడంతో చికిత్స నిమిత్తం ముందుగా మదీనాగూడలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అనంతరం నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాళం వేసిన నాలుగు ఇళ్లలో చోరీ

సంగారెడ్డి టౌన్ : తాళం వేసిన నాలుగు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన సంగారెడ్డిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. రూరల్ స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో గల సాయి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మారుతీ 18న తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊరికి వెళ్లాడు. అదే రోజు అర్ధరాత్రి ఇంట్లో దొంగలు పడి బీరువాలోని 14 తులాల బంగారం, రూ.15 వేల నగదు దోచుకెళ్లాడు. మరుసటి రోజు మారుతీ కుటుంబ సభ్యులు ఇంటికొచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. అదే రోజు విద్యానగర్‌లోని మరో ఇంట్లో 40 తులాల వెండి ఆభరణాలు, రూ.90 వేల నగదు, కొంత బంగారం దోచుకెళ్లినట్లు సమాచారం. విద్యానగర్ పరిసర ప్రాంతాల్లో మరో రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడినట్లు పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో అధికారులు

జోగిపేట(అందోల్): అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్ నుంచి టేక్మాల్‌కు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం వచ్చింది. మంగళవారం ఉదయం పోలీసు బృందంతో వాహనాల తనిఖీ చేపట్టి స్థానిక బసవేశ్వర విగ్రహం వద్ద లారీని అదుపులోకి తీసుకున్నాం లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చాం. వారు పరిశీలించి సుమారు 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని ఖేడ్ సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.

నమో దీదీ.. ఆమెకు ఉపాధి



మహిళా సాధికారతకు మరో అవకాశం

- నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- డీఆర్డీఏ ద్వారా 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు అందజేత
- జిల్లాలో రెండు మండలాలు ఎంపిక
- మహిళలు సాంకేతికంగా ఉపాధి పొందే అవకాశం

మెదక్ కలెక్టరేట్: మహిళా సాధికారికతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంలో మీ సేవ, ఫౌల్ట్రీ, నాటుకోళ్ల పెంపకం, క్యాంటీన్లు వంటి 20 పథకాలు అందిస్తుంది. ఇందులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇటీవల మహిళా సమాఖ్య సభ్యుల ద్వారా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయించారు. అలాగే జిల్లాలోని నార్సింగి మండల కేంద్రానికి చెందిన మరో మహిళా సంఘం సభ్యురాలికి మొబైల్ క్యాంటీన్ వాహనం అందజేశారు. ఇదే కోవాలో మహిళలు సాంకేతికతో ఆర్థికాభివృద్ధి సాధించేలా కేంద్ర ప్రభుత్వం నమోద డ్రోన్ దీదీ పథకం ప్రవేశ పెట్టి డ్రోన్లు అందజేస్తుంది.

రూ.8 లక్షల వరకు సాయం

ఈ ఏడాది వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రకటించింది. తాజాగా ఈ పథకానికి సంబంధించిన ఆపరేటింగ్ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. స్వయం సహాయ సంఘాల్లోని మహిళా సభ్యులకు డ్రోన్ టెక్నాలజీని పరిచయం చేయడమే ఈ స్కీమ్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ స్కీమ్‌లో భాగంగా స్వయం ఉపాధి పొందాలనుకుంటున్న మహిళలకు కేంద్రం ప్రభుత్వం గరిష్ఠంగా రూ.8 లక్షల వరకు సాయం అందిస్తుంది. ఈ సొమ్మును మళ్లీ తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. డ్రోన్ కోసం కావాల్సిన మిగితా డబ్బులను 3 శాతం నామ మాత్రపు వడ్డీ రేటుతో రుణం ఇస్తారు.

80 శాతం సబ్సిడీ

రూ.10 లక్షలు పెట్టి డ్రోన్ కొనుగోలు చేస్తే మహిళా సంఘాలు రూ.2 లక్షలు 3 శాతం వడ్డీ రేటుతో చెల్లిస్తే కేంద్రం రూ.8 లక్షల వరకు ఇస్తుంది. డ్రోన్‌తోపాటు 4 బ్యాటరీలు, ఛార్జింగ్ హబ్, జెట్ సెట్, డ్రోన్ బాక్స్ వంటివి వస్తాయి. అలాగే అంతకు ముందు మహిళలకు డ్రోన్ పైలట్ ట్రైనింగ్ ఇస్తారు. ఈ శిక్షణ సమయంలో మహిళలకు రూ.15 వేల గౌరవ వేతనం అందించనున్నారు. స్వయం ఉపాధి పొందాలనుకుంటున్న మహిళలకు ఇది గొప్ప అవకాశంగా చెప్పవచ్చు. డ్రోన్ల వినియోగం విజయవంతమైతే అన్ని మండలాలకు విస్తరించే అవకాశం ఉంది. దీంతో వ్యవసాయ రంగంలో పెను మార్పులు రానున్నాయి.

రెండు సమాఖ్యల ఎంపిక

జిల్లాలో 20 మండలాలు ఉండగా, ఒక్కో మండలానికి ఒక్కో సమాఖ్య ఉంటుంది. అలాగే 4 మున్సిపాలిటీలు ఉండగా 4 పట్టణ సమాఖ్యలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో డ్రోన్లు అందించేందుకు చిన్నశంకరంపేట, చిలిపిచెడ్ మండల సమాఖ్యలను అధికారులు ఎంపిక చేశారు. మండల సమాఖ్య సభ్యులకు అందించడమే కాకుండా వాటి నిర్వహణకు ఇద్దరిని ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ డ్రోన్లతో వరి, పత్తి, మామిడి తోటలకు పురుగు మందుల స్ప్రే చేయొచ్చు. ఫలితంగా రైతులు అనారోగ్య సమస్యలు, కూలీల కొరతను అధిగమించడంతోపాటు సమయం కలిసి వస్తుంది. ఇంతగా ప్రయోజనాలు ఉన్నందున డ్రోన్ల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇందుకోసం ప్రతి పాదనలు పంపించారు. త్వరలో సమాఖ్యలకు డ్రోన్లు అందించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం


ఉపాధ్యాయుడు సంధానిని సన్మానిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన కాన్ఫరెన్స్‌లో సయ్యద్ సంధాని పాల్గొని రాణించడం గర్వకారణమని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంధానిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బక్రిచెప్యాల పాఠశాల కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తన గణిత విద్యాబోధన పద్ధతులు జాతీయ స్థాయిలో ప్రదర్శించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు రామస్వామి, రంగనాథ్, జీసీడీవో ముక్తేశ్వరి, లక్ష్మణ్, జనార్దన్, నాగేందర్ రెడ్డి, యూసుఫ్, విష్ణు వర్ధన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ గుర్తింపునకే పరీక్షలు

సిద్దిపేటజోన్: ఒలింపియాడ్ పరీక్షల వల్ల విద్యార్థుల ప్రతిభను గుర్తించే అవకాశం ఉందని ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీటీసీ భవన్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ రంగంలో ముందుకు సాగాలంటే తప్పనిసరి ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెంచడానికి టెస్టు ఉపయోగపడుతుందన్నారు. విజేతలకు మెమోంటో, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్ ప్రతినిధులు శ్రీనివాస్, ముజీబ్, మధు, రవి, జ్యోతి, మంజుల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సోషల్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

సిద్దిపేటరూరల్: తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ఇర్కోడ్ మోడల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థి భార్గవ్ ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రవిందర్ గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ జీ.రమేశ్ చేతుల మీదుగా అవార్డు, పురస్కారాన్ని విద్యార్థి అందుకున్నాడు.

సేవా దృక్పథం అవసరం

డీఈఓ రాధాకృష్ణ

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన విద్యార్థులకు ప్లేట్లు, బ్యాడ్జీస్, పాఠశాలకు స్పీకర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పేద విద్యార్థులకు సేవ చేయడం హర్షణీయమని, ప్రతి ఒక్కరికీ సేవా దృక్పథం అవసరమని పేర్కొన్నారు. దాతలు ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని చెప్పారు. బాలాజీ ఇండ్రస్టీస్, పరమేశ్వర్‌ల సహకారంతో అందజేసినట్లు హెచ్‌ఎం శ్రావణి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింగం, వాసు, విద్యాసాగర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ రాధాకృష్ణ

వీరగల్లుల ఆనవాళ్లు లభ్యం

- అనాజీపూర్‌లో బయటపడిన విగ్రహాలు
- 17వ శతాబ్దపు నాటివిగా గుర్తింపు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలోని బెస్త ఎల్లయ్య వ్యవసాయ పొలంలో 17వ శతాబ్దపు నాటి వీరగల్లుల ఆనవాళ్లు బయట పడడం విశేషం. వీరగల్లుల వని వీరుడి ఎడమ చేతిలో బాణం, కుడి చేతిలో విల్లు పట్టుకొని యుద్ధానికి సిద్ధం అవుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. మెడలో హారాలు, దండ, రెట్టలకు కడియాలు ఉన్నట్లు , వీరుడు బాణం ధరించడం వల్ల కొంత మంది రాముడిగా, మరి కొంత మంది హనుమంతుడిగా పిలిచేవారని పరిశోధకులు తెలిపారు. గ్రామంలో పోచమ్మ దేవాలయం వద్ద దాదాపు ఇదే మాదిరిగా మరొక వీరగల్లు శిల్పం ఉన్నట్లు గుర్తించారు. అలాగే గ్రామం బయట హనుమాన్ దేవాలయంలో ఉన్న నంది, వినాయకుడి, నాగశిల విగ్రహాలను నిశితంగా పరిశీలిస్తే అవి చాళుక్యుల కాలానికి చెందినవని కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆనవాళ్లపై ఇంకా లోతుగా పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు.


వ్యవసాయం పొలంలో బయటపడ్డ వీరగల్లు విగ్రహం

విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్‌లో రైల్వే ట్రాక్‌పై మృతదేహం


భార్గవి (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన విద్యార్థిని భార్గవి (19) హైదరాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన దర్శనం చంద్రయ్య, బాలవ్వ దంపతుల రెండో కూతురు భార్గవి హైదరాబాద్‌లో గల ఆంధ్ర మహిళా సభలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. జామై ఉస్మానియా రైల్వే ట్రాక్‌పై మంగళవారం ఉదయం మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. పెద్దకోడూరుకు చెందిన భార్గవిగా గుర్తించారు. భార్గవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు హుటాహుటినా హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడు..

తూప్రాన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి కథనం మేరకు.. మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన గొరారం సాయికుమార్(22) చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందారు. అప్పటి నుంచి చిన్నాన్న వద్ద పెరిగాడు. తూప్రాన్ పట్టణంలోని ఓ మెడికల్ ఏజెన్సీలో పని చేస్తూ ఎల్లమ్మ దేవాలయం కాలనీలో అద్దె గదిలో మరో స్నేహితుడితో ఉంటున్నాడు. మంగళవారం ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయం గుర్తించిన స్నేహితుడు మృతుడి చిన్నాన్నతో పాటు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సాయికుమార్ తాను ఒంటరి వాడినని మనస్తాపం చెందేవాడని, ఆ కారణంతోనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలలో సరస్వతీ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన సరస్వతీ విగ్రహం

నిజాంపేట(మెదక్): గుర్తు తెలియని దుండగులు ప్రభుత్వ పాఠశాలలోని సరస్వతీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటన నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని సరస్వతీ మాతా విగ్రహాన్ని మంగళవారం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటపై విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, గ్రామస్తులు పాఠశాల ఎదుట రోడ్డు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళన వద్దకు చేరుకున్న ఏఎస్ఐ జయపాల్‌రెడ్డి దుండగుల పట్టుకొని కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంజీవులు, తిరుపతి, ప్రశాంత్ ఇతర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


పవన్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మండల కేంద్రంలోని చిన్నఘనాపూర్ గిరిజన తండా(ఐఎంఎల్ డిపో)కు చెందిన గుగులోత్ పీర్ సింగ్- ఛాను దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. పెద్ద కుమారుడు గుగులోత్ పవన్ (22)హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సాయంత్రం పోతంశెట్టి పల్లి చౌరస్తాలో చేపలు కొనుగోలు చేసి బైక్‌పై ఇంటి కొస్తున్నాడు. ఏడుపాయల కమాన్ మలుపు వద్దకు రాగానే జోగిపేట వైపు నుంచి లారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు

సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్

మెదక్ మున్సిపాలిటీ: ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్లకు ఆయుధాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్ పేర్కొన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పిరమిడ్, మల్టీ లెవలింగ్ మార్కెటింగ్ మోసాల గురించి సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్ మాట్లాడారు. విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో మోసాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఆఫర్లు పెట్టి ప్రజలనుంచి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరి కొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి వంచన చేస్తున్నారని తెలిపారు. మొబైల్ ఫోన్లలో ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఈ-మెయిల్, ఫోన్ కాల్‌ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించి కుట్రలు చేస్తారని వాటికి ఎట్టి పరిస్థితుల్లో లొంగొద్దన్నారు. ఒకవేళ మోసపోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కి గానీ, సమీప పోలీస్‌స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయాలన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్

మెదక్ కలెక్టరేట్: ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ నిర్వహణ అధికారి యూనస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే వేతన సవరణ, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రతపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఎస్ఎన్ పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేలు మట్టి ఖర్చులు, టార్గెట్లు రద్దు చేస్తూ గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని చెప్పారు. ఆదివారం, పండగలకు సెలవులుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అలాగే వేతనంతో కూడిన 20 రోజులు క్యాజువల్ సెలవులు, 6 నెలల మెడికల్ సెలవులు కల్పించాలన్నారు. సీఐటీయూ మెదక్ పట్టణ నాయకులు సంతోష్, ఆశాలు శ్యామల, లక్ష్మీ, సుజాత, నాగమణి, మంజుల పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి పోటీలు


కబడ్డీ ఆడుతున్న బాలురు

ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడల పోటీలు మంగళవారం సంబురంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్, కబడ్డీ పోటీలు జరుగగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీ ఫైనల్ బాలికలు, బాలురు పోటీలు రేపు జరగనున్నాయి. కార్యక్రమంలో ఎర్త్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు కలవెని శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.. ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడానికి సృజనాత్మకత, విద్య, క్రీడా, ఆరోగ్య అంశాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కన్న తండ్రే కూతురిని కడతేర్చాడు

- గొంతు నులిమి బావిలో పడేసిన వైనం
- బాలిక మృతి కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడు రిమాండ్‌కు తరలింపు


నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ జక్కుల హన్మంతు

రాయికోడ్(అందోల్): కన్న తండ్రే కూతురిని కడతేర్చిన ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో వెలుగులోకి వచ్చింది. ఈనెల 16వ తేదీన బావిలో ఓ బాలిక మృతదేహం తేలగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలిక తండ్రే హత్య చేసినట్లు తేల్చారు. మంగళవారం రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని సంగాపూర్ గ్రామానికి చెందిన సతీశ్ భార్య అనితపై అనుమానం పెంచుకొని తరచూ గొడవ పడుతుండేవారు. ఏడాది నుంచి అనిత భర్తకు దూరంగా ఉంటుంది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉండగా చిన్న కూతురు హరిత (6) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పెద్ద కూతురు వైష్ణవి(11) తండ్రి సతీశ్ దగ్గరే ఉంటోంది. వైష్ణవి తరచూ తల్లి దగ్గరకు వెళ్లిపోతానని అనడంతో తండ్రి ఒప్పుకోలేదు. ఈ క్రమంలో కూతురిని హత్య చేసేందుకు పథకం వేశాడు. 10వ తేదీన తెల్లవారుజామున తల్లి దగ్గరకు పంపిస్తానని నమ్మించి కూతురిని తనతో తీసుకెళ్లాడు. గ్రామ సమీపంలోని ఓ నర్సరీ పక్కకు తీసుకెళ్తుండగా అనుమానం వచ్చి ఎక్కడికి తీసుకెళ్తున్నావ్ నేను రాను అని వాదించింది. దీంతో కోపోద్రిక్తుడైన సతీశ్ కూతురిని కొట్టి, గొంతు నులిమి బావిలో తోసేశాడు. అనంతరం ఏమి ఎరగనట్లు తన కూతురు కనిపించడం లేదని తల్లి సమమ్మకు చెప్పగా గ్రామంలో వెతికారు. 16న వ్యవసాయ బావిలో బాలిక మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు తండ్రిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చిన్న కూతురు మృతిపై విచారణ

కన్న తండ్రే కూతురిని చంపడంతో నిందితుడి చిన్న కూతురు హరిత మృతిపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. హరిత నెలన్నర కిందట అనారోగ్యంతో సంగాపూర్‌లోని ఇంట్లోనే చనిపోయిందా లేక వైష్ణవి తరహాలో హత్యకు గురైందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే చిన్న కూతురు మృతికి కారణాలు కూడా సమగ్ర దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని పోలీస్‌లు తెలిపారు.